సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



94 రైళ్లు రద్దు

వరంగల్–హసన్‌పర్తి– కాజీపేట ఎఫ్ క్యాబిన్ల మధ్య రైల్వే లైన్ పనులతో కాజీపేట, వరంగల్ మీదుగా నడిచే 94 రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. - 8లో▸



కళాభవనం కథ కంచికేనా?

వరంగల్ పోచమ్మమైదాన్‌లో చేపట్టిన మల్టీపర్పస్ కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణం నిధుల లేమితో నిలిచిపోయింది. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $32^0/25^0$

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలు చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కాళేశ్వరాలయంలో గణపతి హోమం



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గణపతి హోమాన్ని అర్చకులు యాగశాలలో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ మారుతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అర్చకులు, వేదపండితులు త్రిపురారి కృష్ణమూర్తి, పనకంటి ఫణీంద్రశర్మ, భక్తులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంపై నేడు సమీక్ష

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై కలెక్టర్ రాహుల్‌శర్మ గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 16, 17తేదీల్లో నిమజ్జనానికి ఇతర ప్రాంతాల నుంచి విగ్రహాలను భక్తులు వందలాదిగా తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం రాజరాజేశ్వర వసతి గృహం హాల్‌లో గురువారం మధ్యాహ్నం 2గంటలకు సమీక్ష నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సమీక్షకు జిల్లా అధికారులు హాజరు కావాలని ప్రకటనలో తెలిపారు.

నియామకం



సయ్యద్ గాలిఫ్

రేగొండ: బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్ గాలిఫ్‌ను నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలో కష్టపడేవారికి గుర్తింపు ఉంటుందని ఈ సందర్భంగా నిషిధర్‌రెడ్డి పేర్కొన్నారు.

వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి



భూపాలపల్లి అర్బన్: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో వచ్చిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రాణనష్టం ఆర్థిక నష్టాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం, వరంగల్, భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామలతోపాటు వివిధ జిల్లాల్లో చెరువులకు గండ్లు పడి పంట నష్టం జరిగిందన్నారు. పంటలు, ప్రాణనష్టం జరిగినా కేంద్రం ప్రభుత్వం ఇంత వరకు ఎలాంటి ఆర్థిక సహకారం చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి సాతుకు ప్రవీణ్, నాయకులు క్యాతరాజ్ సతీశ్, జోసెఫ్, రవి, కాంతారావు, తిరుపతి, రాజేశ్‌లు పాల్గొన్నారు.

17న 'ప్రజా పరిపాలన' దినం



సాక్షి ప్రతినిధి, వరంగల్: ఈనెల 17వ తేదీన తెలంగాణ ప్రజా పరిపాలన దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అన్ని జిల్లాల్లో ఆ రోజు ఉదయం 10 గంటలకు జాతీయ పతాకాలను ఆవిష్కరించి వేడుకలు జరపాలని బుధవారం ఆదేశాలు జారీ అయ్యాయి. జాతీయ జెండా ఆవిష్కరించేందుకు అతిథులను కూడా నామినేట్ చేశారు. జాబితా ప్రకారం హనుమకొండలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ములుగులో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క), జనగామలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మహబూబాబాద్‌లో ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య ముఖ్య అతిథులుగా పతాకావిష్కరణ చేయనున్నారు.

వేతనాలు పెరిగేదెన్నడు..?

తక్కువ జీతాలతో అన్‌మ్యాన్డ్ కార్మికుల ఇబ్బందులు

- విద్యుత్ శాఖలో క్షేత్రస్థాయిలో వీరి సేవలే కీలకం
- పనిభారం ఎక్కువ.. వేతనాలు తక్కువని ఆవేదన
- డిమాండ్లు నెరవేర్చాలని వేడుకోలు



పక్క ఫొటోలోని వ్యకిత గుడిపాటి అనంతరెడ్డి, కాటారం మండలం రేగులగూడెంలో అన్‌మ్యాన్డ్ కార్మికుడిగా విధులు నిర్వర్తించేవాడు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్‌లు వేస్తుండగా 18 ఏప్రిల్ 2021లో ఆపరేటర్ నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో కాలుకు చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రభుత్వం అధికారులు చికిత్స చేయించారు తప్పా.. ఎలాంటి పరిహారం ఇవ్వలేదు. దీంతో అనంతరెడ్డి అవిటివాడిగా ఇంటికే పరిమితమయ్యాడు. ఇతని భార్య కూలీ పనులకు వెళ్లి భర్తతోపాటు, ఇద్దరు పిల్లలను పోషిస్తోంది. ఈ వేదన ఇతని ఒక్కనిదేకాదు. చాలామంది కార్మికులు ప్రమాదాలకు గురై కుటుంబ సభ్యులకు భారమై బతుకుతున్నారు.

భూపాలపల్లి రూరల్: విద్యుత్ సరఫరాలో ఏ సమస్య వచ్చినా వెంటనే వారు రంగంలోకి దిగి మరమ్మతులు చేస్తారు. ప్రాణాలకు తెగించి ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వర్తించినా వారికి వచ్చే వేతనం అంతంతే.. ఇది టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న వందలాది మంది ప్రత్యామ్నాయ (అన్‌మ్యాన్డ్) కార్మికుల దయనీయ పరిస్థితి. సాధారణంగా విద్యుత్ శాఖ ఉద్యోగులకు జీతాలు అధికంగా ఉంటాయి. అదే శాఖలో పనిచేసే అన్‌మ్యాన్డ్ కార్మికుల పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. చేసిన పనికి వచ్చే వేతనానికి పొంతన ఉండటం లేదు. వీరు సంస్థ ఉద్యోగులకు సహాయకులుగా ఉంటూ ఎలాంటి సమస్య తలెత్తినా ముందుండి పనులు చేస్తుంటారు. టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో 2013 నుంచి అన్‌మ్యాన్డ్ కార్మికులు విధులు నిర్వర్తిస్తుండగా.. జిల్లాలో 68 మంది కార్మికులు పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో ప్రమాదాల బారిన పడుతున్నా తగిన సాయం అందడంలేదని ఆవేదన చెందుతున్నారు.

ఇవీ డిమాండ్లు..

ఐటీఐ, డిప్లొమా విద్యార్హతలతో స్కిల్డ్, ఇతర విద్యార్హతలతో అన్‌స్కిల్డ్ వర్కర్లుగా విభజించి ఆర్టిజన్ కార్మికులుగా గుర్తించాలని అన్‌మ్యాన్డ్ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతోపాటు సబ్ స్టేషన్లలో ఖాళీగా ఉన్న ఆపరేటర్ పోస్టులను అన్‌మ్యాన్డ్ వర్కర్లతో భర్తీ చేయాలి. ప్రస్తుతం ఆపరేటర్లుగా పనిచేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులను తొలగించి అన్‌మ్యాన్డ్ వర్కర్లకు అవకాశాలు కల్పించాలి, ప్రతినెలా బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించాలని, జూనియర్ లైన్‌మెన్ నియామకాల్లో అన్‌మ్యాన్డ్ వర్కర్లకు సీనియారిటీ ప్రకారం మార్కులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.



క్షేత్రస్థాయిలో కీలకం..

స్థానికంగా కట్టర్లు, ప్రత్యామ్నాయ కార్మికులుగా పిచిచే వీరి పని డీటీఆర్‌ల వద్ద, ఇతర ప్రాంతాల్లో అడ్డుగా ఉన్న చెట్లను కొట్టడం, కాలిపోయిన ఫ్యూజ్‌లు వేయడం, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మరమ్మతులు, బిల్లుల రీడింగ్, బకాయిల వసూలు, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం, తొలగించడం చేస్తుంటారు. రెగ్యులర్ సిబ్బందికి సాయంగా ఉంటూ విద్యుత్ స్తంభాలు ఎక్కి పనులు చేస్తుంటారు. ఇంతచేస్తున్నా వీరికి కటింగ్‌లుపోను కాంట్రాక్టరు ద్వారా ప్రస్తుతం నెలకు రూ.10,800 మాత్రమే చెల్లిస్తున్నారు. విద్యుత్ శాఖలో ఎస్పీడీసీఎల్ హైదరాబాద్ పరిధిలో తమలాగే పనిచేసిన వారిని ఆర్టిజన్లుగా అప్ గ్రేడ్ చేశారని, ఎన్పీడీసీఎల్‌లో మాత్రం వెట్టి చాకిరీ చేయిస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు పోలీసులు కేసు నమోదు చేయకుండా కొందరు అధికారులు, మధ్యవర్తులు పరిహారం ఇచ్చి సరిపెడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్పీడీసీఎల్‌లో 60 మందికిపైగా కార్మికులకు ప్రమాదాలు జరిగినట్లు చెబుతున్నారు.

జిల్లాలో అన్‌మ్యాన్డ్ కార్మికుల సంఖ్య..

భూపాలపల్లి పట్టణం	03
భూపాలపల్లి రూరల్	04
గణపురం	04
రేగొండ	05
చిట్యాల	05
టేకుమట్ల	05
మొగుళ్లపల్లి	04
కాటారం	09
మల్హర్	05
మహదేవపూర్	11
మహాముత్తారం	10
పలిమెల	03

ఉద్యోగ భద్రత కల్పించాలి



టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో ఏళ్లుగా శాశ్వత ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నాం. అయినా నెలకు రూ.10,800మాత్రమే అందిస్తున్నారు. ఎస్పీడీసీఎల్‌లో మాత్రం అన్‌మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్ కార్మికులుగా గుర్తించారు. ఎన్పీడీసీఎల్‌లో అన్‌మ్యాన్డ్ కార్మికులుగానే మిగిలిపోయాము, ఇక్కడ కూడా ఆర్టిజన్‌లుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలి.

– రాంటెంకి సమ్మయ్య, అన్‌మ్యాన్డ్ కార్మికుడు

సమస్యలు పరిష్కరించాలి



ఎన్పీడీసీఎల్ పరిధిలో జిల్లాలో 68 మంది అన్‌మ్యాన్డ్ కార్మికులు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నారు. పలువురు ప్రమాదాలు జరిగి మంచాన పడ్డారు. మృతి చెందిన అన్‌మ్యాన్డ్ కార్మికుల కుటుంబాలను గుర్తించి అర్హతను బట్టి ఉద్యోగాలివ్వాలి.

– మోత్కూరి కోటి, జిల్లా కార్యదర్శి (యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్, సీఐటీయూ అనుబంధం)



విద్యుత్ మరమ్మతు చేస్తున్న కార్మికుడు(ఫైల్)

రీజినల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఇన్‌చార్జ్ జీఎం వెంకటరామిరెడ్డి

భూపాలపల్లి అర్బన్: సింగరేణి వర్క్ పీపుల్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రీజినల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఏరియాలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ఏరియా ఇన్‌చార్జ్ జీఎం వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. ఆర్జీ–3, భూపాలపల్లి ఏరియాల జట్ల మధ్య షెటిల్, ఏరియా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. రీజినల్ స్థాయిలో నిర్వహించిన షెటిల్ పోటీల్లో భూపాలపల్లి జట్టు ఆర్జీ–3 జట్టుపై గెలుపొంది కంపెనీ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఏరియా అధికార ప్రతినిధి మారుతి వెల్లడించారు.

ఓటరు నమోదు దరఖాస్తుల స్వీకరణ



భూపాలపల్లి అర్బన్: 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేస్తారని తెలిపారు. 2025 జనవరి 1ని ప్రామాణికంగా తీసుకుని నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, పోలింగ్ కేంద్రం మార్పు, మరణించిన వ్యక్తుల ఓటు తొలగింపు తదితర అభ్యంతరాలపై అక్టోబర్ 19 నుంచి 28వ తేది వరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. పొరపాట్లు ఉంటే నిర్ణీత ఫారాన్ని సమగ్రంగా పూర్తి చేసి బూత్ స్థాయి అధికారులకు అందచేయాలని తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్



పనులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్

కాటారం: అమ్మ ఆదర్శ పాఠశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులకు సూచించారు. కాటారం మండలం గంగారం మోడల్ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పనుల మొత్తం విలువ, చేపట్టాల్సిన పనులు, పూర్తయిన పనులు, పెండింగ్ పనుల వివరాలను గూర్చి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధి పనుల్లో భాగంగా అవసరమైన వాటికి ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు పూర్తి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం భోజనం అందించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. సబ్ కలెక్టర్ వెంట ఎంపీఓ వీరస్వామి, అమ్మ ఆదర్శ పాఠశాల ఏఈ తిరుపతి, కమిటీ సభ్యులు ఉన్నారు.

భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: రానున్న రోజుల్లో భూపాలపల్లి మున్సిపాలిటీని అన్నివిధాలా అభివృద్ధి చేసి ముందు స్థానంలో నిలబెడతానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కుందూరుపల్లి, భాస్కరగడ్డలో టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి రూ.కోటి వెచ్చించి నూతనంగా నిర్మించనున్న సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూపాలపల్లి మున్సిపాలిటీని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. పట్టణవాసుల దాహార్తి తీర్చేందుకు ఇటీవల అమృత్ పథకం 2.0 ద్వారా రూ.18.99 కోట్లతో ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టినట్లు గుర్తు చేశారు. రోజురోజుకూ పట్టణం విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్‌లో పట్టణ వాసులకు తాగు నీటి కష్టాలు లేకుండా కృషి చేస్తున్నట్లు వివరించారు. సంబంధిత కాంట్రాక్టరు సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ..

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భూపాలపల్లి పట్టణ పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

డీపీఓ నారాయణ రావు



మాట్లాడుతున్న డీపీఓ నారాయణ రావు

రేగొండ: గ్రామాల్లో ప్రతి రోజూ విధిగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి నారాయణ రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్‌లతో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో డీపీఓ మాట్లాడారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లోని వీధిలైట్లను పరిశీలించాలని అన్నారు. ఇంటి పన్నుల వసూలు విషయంలో జాప్యం చేయకూడదని, వంద శాతం పన్నులు వసూలు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గడ్డం ప్రసాద్‌రావు, పంచాయతీ కార్యదర్శులు రాంబాబు, వేణుగోపాల్, సురేందర్, మమత, పద్మ, కారోబార్‌లు నాగరాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమావేశాలకు రావాల్సిందే..

- హాజరుకాకపోతే చర్యలు తప్పవు
- మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఆగ్రహం
- పనులు పెండింగ్‌లో ఉండడంతో కమిషనర్‌పై మండిపాటు
- కలెక్టర్‌తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, పక్కన కలెక్టర్ రాహుల్‌శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి తదితరులు

భూపాలపల్లి అర్బన్: ప్రజాసమస్యల పరిష్కారానికి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరుకావాల్సిందేనని, సమావేశాలకు రానివారిపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి ప్రస్తావించారు. ఎర్రచెరువు సమీపంలోని ప్రభుత్వ స్థలంలో వారసంత, పార్కు ఏర్పాటు చేయాలని, హెల్త్‌వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం వేగవంతం చేయాలని వార్డు కౌన్సిలర్ కన్నం యుగేందర్ కోరారు. గణేశ్‌చౌక్‌లో రోడ్లపై పండ్ల బండ్లు పెడుతున్నారని వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పట్టణంలో నిర్మించి స్ట్రీట్ వెండర్ దుకాణాలకు తరలించాలని కౌన్సిలర్ ముంజాల రవీందర్ తెలిపారు. ప్రభుత్వం, ప్రైవేట్ వెంచర్లు మున్సిపాలిటీకి కేటాయించిన స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని, మున్సిపల్ వాహనాలకు ఇన్స్యూరెన్స్, ఫిట్‌నెస్ లేకుండా నడిపిస్తున్నారని ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వార్డు కౌన్సిలర్ శిరుప అనిల్ ప్రశ్నించారు. మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చే విధంగా హోర్డింగ్, ఫ్లెక్సీల నుంచి ఫీజులు వసూలు చేయాలని కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని పోచమ్మ మైసమ్మ ఆలయాలకు టెండర్లు వేసుకొని కొంత మంది భక్తుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నారని కౌన్సిలర్ చల్ల రేణుక ఆరోపించారు. వారసంత రోజున రోడ్డుపైన కూరగాయాలు, ఇతర దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని దీంతో వాహనాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సింగరేణి 1వ గని, ఓసీ–2 నుంచి బొగ్గు లారీల కోసం ఏర్పాటు చేసిన బైపాసు రోడ్డు నుంచి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని వార్డు కౌన్సిలర్ ఈంజపల్లి మురళి కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కలెక్టర్, శాసనసభ్యుడు చెప్పినా పనులు చేయకపోతే మున్సిపల్ కమిషనర్ ఎందుకు ఉన్నట్లు అని కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఆస్తులు పరిరక్షణకు ఐరన్ ఫెన్సింగ్ వేయాలని తెలిపారు. చెరువు శిఖాల్లో ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొదని అన్నారు. మున్సిపల్ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత మీకు లేదా అని కమిషనర్‌ను ప్రశ్నించారు. స్వచ్ఛ వాహనాలకు ఎందుకు ఇన్సూరెన్స్ చేయలేదని కమిషనర్‌ను ప్రశ్నించారు. సమావేశానికి ఆబ్కారీ శాఖ అధికారి హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిమితికి మించి లోడుతో వెళ్తున్న ఇసుక లారీలపై కమిషనర్ చర్యలు తీసుకునే అధికారం ఉందన్నారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ హరీశ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన గోదావరి



రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద తగ్గిన గోదావరి వరద ఉధృతి

ఏటూరునాగారం: మండల పరిధిలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద మంగళవారం ఉగ్రరూపం దాల్చిన గోదావరి బుధవారం శాంతించింది. ఉదయం నుంచి తగ్గుముఖం పట్టడంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం సాయంత్రానికి పుష్కరఘాట్ వద్ద గోదావరి నీటి మట్టం 14.60 మీటర్లకు చేరి ప్రవహిస్తోంది. రామన్నగూడెం – రాంనగర్ మధ్యలో ఉన్న రోడ్డుపై వరద నీరు తగ్గడంతో అధికారులు రాకపోకలకు అనుమతి ఇచ్చారు. అలాగే ఓడవాడలో సైతం వరద నీరు తగ్గి పొలాల పక్క నుంచి ప్రవహిస్తోంది.

అమరుల సేవలు మరువలేనివి



అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న సీసీఎఫ్ ప్రభాకర్

కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్

భూపాలపల్లి: అటవీశాఖలో విధి నిర్వహణలో అమరులైన వారి సేవలు మరువలేనివని కాళేశ్వరం జోన్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీసీఎఫ్) ప్రభాకర్ అన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అటవీ అధికారులు, సిబ్బంది తొలుత అటవీశాఖ కాంప్లెక్స్ ఆవరణలో అమరులను స్మరించుకొని మౌనం పాటించారు. అనంతరం గణేష్‌చౌక్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా మీదుగా కేటీకే 5వ ఇంక్లైన్ ఆర్చ్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. కాంప్లెక్స్‌కు చేరుకున్న తర్వాత రక్తదాన శిబిరం నిర్వహించగా 25 మంది అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. అనంతరం సీసీఎఫ్ మాట్లాడుతూ.. విధి నిర్వహణ, అడవుల రక్షణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 22 మంది అటవీ ఉద్యోగులు అమరులయ్యారని తెలిపారు. వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అటవీ ఉద్యోగులు తమ కుటుంబాలను చూసుకుంటూ అడవుల రక్షణపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ వసంత, ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ జోగేందర్, ఎఫ్ఆర్ఓ నరేశ్, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైల్వే గార్డుల సమస్యలు పరిష్కరించాలి



నిరసనలో పాల్గొన్న ట్రైన్ మేనేజర్లు

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే లోకోపైలెట్ డిపో ఎదుట బుధవారం రైల్వే ట్రైన్ మేనేజర్లు (గార్డులు) తమ డిమాండ్లు పరిష్కరించాలని ధర్నా చేపట్టారు. భారతీయ రైల్వేలో విధులు నిర్వర్తిస్తున్న ట్రైన్ మేనేజర్ల వర్కింగ్ సిస్టమ్‌లో అవసరమైన సేఫ్టీకి సంబంధించిన వస్తువులు, పుస్తకాలు ఉండే లైన్ బాక్స్‌లు తీసేసి వాటి స్థానంలో ట్రాలీ బ్యాగ్స్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నాలో భాగంగా ఇక్కడ ధర్నా చేపట్టినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే నాయకులు, ట్రైన్ మేనేజర్లు పాల్గొన్నారు.

పెచ్చులూడిన పాఠశాల స్లాబు

- ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రమాదం
- బయ్యారంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఘటన



బయ్యారం: బయ్యారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల వరండాలోని స్లాబు పెచ్చులూడింది. దీంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. పాఠశాల ఆవరణలోని కార్యాలయ వరండా శిథిలావస్థకు చేరింది. ఇటీవల కురిసిన వర్షాలకు స్లాబు దెబ్బతినడంతో బుధవారం మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో స్లాబు పెచ్చులూడాయి. ఈ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో తృటిలో పెనుప్రమాదం తప్పింది. ఇప్పటికైనా శిథిలావస్థలోని గదులు తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు అధికారులను కోరుతున్నారు.

కళాభవనం కథ కంచికేనా?

నిధులు లేక ఆగిపోయిన పనులు

- 11 ఏళ్లు గడిచినా పూర్తికాని పరిస్థితి
- ట్యాక్సీ స్టాండ్‌గా మారిన నిర్మాణ స్థలం
- వరంగల్ తూర్పులో లేని ఆడిటోరియాలు
- ఇబ్బందులు పడుతున్న కళాకారులు



వరంగల్ పోచమ్మమైదాన్‌లో అసంపూర్తిగా కళాభవనం నిర్మాణం



ట్యాక్సీ పార్కింగ్ స్టాండ్‌గా మారిన కళాభవన ప్రాంగణం

వరంగల్: వరంగల్ పోచమ్మమైదాన్ సమీపంలో చేపట్టిన మల్టీపర్పస్ కల్చరల్ కాంప్లెక్స్ (మినీ రవీంద్ర భారతి) నిర్మాణం నిధుల లేమితో నిలిచిపోయింది. 24-05-2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులు మంజూరు చేయగా.. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న బస్వరాజు సారయ్య ముచ్చటగా మూడోసారి శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు. ఏడాదిలో కళాభవనం నిర్మించాలన్న నిబంధనలతో హైదరాబాద్‌కు చెందిన శ్రీకో ప్రాజెక్టు నిర్మాణ సంస్థ పనులు దక్కించుకుంది. మొదటి విడత పర్యాటక శాఖ నుంచి కళాభవనం నిర్మాణానికి కోటి రూపాయల నిధులు విడుదల చేశారు. బేస్‌మెంట్‌తోపాటు పిల్లర్లు, జనరేటర్ రూం నిర్మించిన కాంట్రాక్టర్‌కు రూ.69.88 లక్షలు చెల్లించారు. నిధులు విడుదలైతే తప్ప మిగిలిన పనులు చేపట్టేది లేదని కాంట్రాక్టర్ భీష్మించుకున్నాడు. దీంతో 11 ఏళ్ల క్రితం ప్రారంభమైన కళాభవనం నిర్మాణ దశలోనే ఉంది. హనుమకొండలో రూ.12 కోట్లతో చేపట్టిన కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ వ్యయం రూ.60 కోట్లకు పెరిగింది. వరంగల్ పశ్చిమ ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి నిధులు మంజూరు చేయించి పూర్తి చేయించారు. కేవలం రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టిన కళాభవనానికి నిధులు తేవడంలో తూర్పు ప్రజాప్రతినిధులు విఫలమయ్యారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కళాభవనం, హరితహోటల్ హామీకే పరిమితం..

కళాభవనం స్థలంలో హరిత హోటల్ నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే నరేందర్ సూచనల మేరకు మూడేళ్ల క్రితం అప్పటి పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్థలాన్ని పరిశీలించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కళాకారులకు కళాభవనం నిర్మించాలని సాంస్కృతిక శాఖ అధికారులు ఆయనకు విజ్ఞప్తి చేశారు. డిజైన్‌లో మార్పులు చేసి కళాభవనం, హరితహోటల్ నిర్మించేందుకు ఇచ్చిన హామీ హామీగానే మిగిలింది.

హనుమకొండ జిల్లా పరిధిలోనే ఆడిటోరియాలు..

ఆర్ట్స్ కళాశాల, నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియం, పోతన ఆడిటోరియం, కాళోజీ కళాక్షేత్రం హనుమకొండ జిల్లా పరిధిలోనే ఉన్నాయి. వరంగల్ జిల్లా నియోజకవర్గ కేంద్రమైన తూర్పులో ఆడిటోరియాలు లేకుండా పోయాయి. కళాభవనం పూర్తయితే తమకు ఆదరణ లభిస్తుందనే ఆశతో జిల్లా కళాకారులు ఎదురుచూస్తున్నారు. కళాభవనం పూర్తి చేయాలని పలుమార్లు కళాకారులు స్థానిక ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి కళాభవనం పూర్తిచేయాలని కళాకారులు కోరుతున్నారు.

కళాభవనం నిర్మిస్తే ప్రాక్టీస్‌కు అనుకూలం



నృత్యంలో శిక్షణ తీసుకున్నా. పోటీల్లో పాల్గొనేందుకు ప్రాక్టీస్ చేసేందుకు వరంగల్‌లో అనువైన ఆడిటోరియం లేక ఇబ్బందులు పడుతున్నాం. నేరుగా కాంపిటీషన్‌కు వెళ్లడం వల్ల అనుకున్న ఫలితాలు రావడం లేదు. స్థానిక కళాకారుల కోసం కళాభవనాన్ని వెంటనే పూర్తి చేయాలి.

-శృతిక ఇప్పకాయల, భరతనాట్య కళాకారిణి, లేబర్ కాలనీ, వరంగల్

ఇబ్బందులు పడుతున్నాం..



వరంగల్‌లో ప్రత్యేకంగా కళావేదిక లేకపోవడం వల్ల దూరం వెళ్లి ప్రదర్శనలు ఇవ్వాల్సి వస్తోంది. శిక్షణ అకాడమీలు ఒకే సమయంలో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తే ఆడిటోరియం అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నాం. ఆడిటోరియం ఉంటే కళాకారులకు ఇబ్బంది ఉండదు.

-గజ్జెల రంజిత్, పేరిణి అధ్యాపకుడు, నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ, వరంగల్

వెంపటి నాగేశ్వరి పేరుపెట్టాలి



భరతనాట్యం, కూచిపూడి తదితర నృత్యాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన వెంపటి చినసత్యం కుటుంబానికి చెందిన వెంపటి నాగేశ్వరి పేరును కళాభవన్‌కు పెట్టాలి. నాగేశ్వరి స్థానికంగా శిక్షణ సంస్థ ప్రారంభించి ఎంతో మందిని కళాకారులుగా తీర్చిదిద్దారు. ఆమె ప్రారంభించిన శిక్షణ సంస్థ ఇటీవలే 50 ఏళ్లు పూర్తి చేసుకుంది.

-అప్పం చందన, క్రిస్టియన్ కాలనీ

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న ఆర్‌జేడీఎం శ్రీనివాస్

వరంగల్: రానున్న వ్యవసాయ సీజన్‌లో రైతులకు గిట్టుబాటు ధరలతో పాటు మౌలిక వసతులు కల్పించాలని వరంగల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్ చాంబర్‌లో డీడీఎం వి.పద్మావతితో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా మార్కెట్ కమిటీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోవు సీజన్ సందర్భంగా మార్కెట్లలో ప్రభుత్వ కనీస మద్దతు ధర, రైతులు, వ్యాపారులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. మార్కెట్లలో తాగు నీటి సదుపాయం, లైటింగ్, మరుగు దొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీదుదారుల నుంచి ప్రతి నెల కొనుగోలు నివేదికలు తీసుకుంటూ మార్కెట్ ఫీజు వసూలు చేయాలని, మార్కెట్లలో కాంటాలు తనిఖీ చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి కె.సురేఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా మార్కెట్ల కార్యదర్శులు, పర్యవేక్షకులు సిబ్బంది పాల్గొన్నారు.

వరకట్న హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

వరంగల్: ఏనుమాముల పీఎస్ పరిధిలోని పైడిపల్లికి చెందిన రావిరాకుల స్వాతి ఆత్మహత్య కేసులో ఆమె భర్త నిరంజన్, అత్త నిర్మలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మామునూరు ఏసీపీ తిరుపతి తెలిపారు. అత్తింటి వరకట్న వేధింపులకు గురైన స్వాతి ఈనెల 5వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 9వ తేదీన మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి కలకోట్ల యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బుధవారం భర్త, అత్తను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తిరుపతి తెలిపారు.

పదోన్నతుల్లో పాత పద్ధతినే కొనసాగించాలి



ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల పదోన్నతుల్లో పాత పద్ధతినే కొనసాగించాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు ఎ.ఆనందం డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యాన మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో టీఓఓ 954, ఎన్ఓఓ 37 లాంటి ఆర్డర్లతో మెరిట్ కమ్ సీనియారిటీ అనే అంశాన్ని ముందుకు తెచ్చి రిజర్వేషన్ కమ్ రోస్టర్ విధానానికి అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారని, విద్యుత్ సంస్థలు జారీ చేసిన ఆర్డర్లు కుట్రపూరితమని ధ్వజమెత్తారు. ఆ ఆర్డర్లను రద్దు చేసి ఇటీవల అడ్‌హక్ పద్ధతిలో ఇచ్చిన పదోన్నతులను ఆర్ఓఆర్ ప్రకారం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు దర్శనాల మొగిలయ్య, కె.కుమారస్వామి, అజ్మీరా శ్రీరాం నాయక్, రౌతు రమేశ్ కుమార్, ప్రభావతి, నర్సింహారావు, దుర్గం మల్లేశం, నందా రాథోడ్, రమేశ్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

17 కిలోల ఎండు గంజాయి పట్టివేత

- వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఘటన



కాశిబుగ్గ: వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ సీఐ సురేందర్, ఆర్పీఎఫ్ సీఐ టీఎస్ఆర్ కృష్ణ

కాశిబుగ్గ : వరంగల్ రైల్వే స్టేషన్‌లో మంగళవారం రాత్రి 17.425 కిలోల ఎండు గంజాయి తరలిస్తున్న నలుగురిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. జీఆర్పీ సీఐ పి. సురేందర్ కథనం ప్రకారం.. వరంగల్ ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది సంయుక్తంగా ప్లాట్‌ఫాం-2పై తనిఖీలు చేస్తుండగా నలుగురు వ్యక్తులు రెండు బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించారు. బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి లభించింది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. మహారాష్ట్రలోని పూణె, మన్మాడ్‌కు చెందిన సోహైల్ షకీర్ ఇనామ్‌దార్, షేక్ అఫ్తాబ్ సమీర్, షేక్ సాకిబ్ జిలానీ, అభిషేక్ తిక్కయ్యరెడ్డి స్నేహితులు. వీరు జల్సాలకు అలవాటు పడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో భువనేశ్వర్ నుంచి మన్మాడ్‌కు గంజాయి తరలించేందుకు రైలులో బయలుదేరారు. మార్గమధ్యలో రైలులో పోలీసులను చూసి భయపడి వరంగల్‌లో దిగారు. మరో రైలు ఎక్కి మన్మాడ్ వెళ్లడానికి యత్నిస్తుండగా వీరిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకున్నారు. ఈఘటనపై ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్ తరలించామని సీఐ పి. సురేందర్ బుధవారం తెలిపారు. గంజాయి విలువ రూ.4,35,625 ఉంటుందన్నారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

రామన్నపేట : గంజాయి విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్ట్ చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. కాజీపేట మండలం శాయంపేటలోని గంగాసాని తిరుమలారెడ్డి నగర్‌కు చెందిన షేక్ రషీదా బేగం మండిబజార్ దగ్గరలోని ఓ మసీదు వద్ద భిక్షాటన చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటోంది. భిక్షాటన ద్వారా వచ్చే డబ్బులు కుటుంబ అవసరాలకు సరిపోకపోవడంతో అప్పులు చేయడంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మానసికంగా కుంగిపోయి ఎలాగైనా సులభంగా డబ్బులు సంపాదించాలనుకుంది. గంజాయి అమ్మితే ఎక్కువ డబ్బులు సంపాదించొచ్చని తెలుసుకుంది. అనంతరం 15 రోజుల క్రితం బల్లార్షా వెళ్లి అక్కడ ఖలీమ్ అనే వ్యక్తి వద్ద నుంచి సుమారు అర కిలో గంజాయి కొనుగోలు చేసి నగరంలోని మండిబజార్ ప్రాంతంలో చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తోంది. రోజు మాదిరిగానే బుధవారం కూడా గంజాయి విక్రయించడానికి మండిబజార్ ప్రాంతంలోని మద్రాసి మసీదు దగ్గర నిల్చుంది. అటు వైపు పెట్రోలింగ్ వెళ్తున్న పోలీసులను చూసి భయపడి పారిపోవడానికి యత్నిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలి నుంచి సుమారు 250 గ్రాముల గంజాయి, రూ.3050 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు.

అప్పుల బాధతో తాపీమేస్త్రీ ఆత్మహత్య

- తీగరాజుపల్లిలో ఘటన



కుమారస్వామి (ఫైల్)

సంగెం: అప్పుల బాధతో ఓ తాపీ మేస్త్రీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సంగెం మండలం తీగరాజుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లతీగల కుమారస్వామి(54) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 7 కోడలుకు టైఫాయిడ్ జ్వరం వచ్చిందని కుమారుడు విక్రమ్ ఫోన్ చేయగా కుమారస్వామి భార్య విజయ ములుగుకు వెళ్లింది. కుమారస్వామి ఒక్కరే ఇంటి వద్ద ఉన్నాడు. బుధవారం ఉదయం గ్రామానికి చెందిన చాపర్తి శంకర్ కూలీ పని కోసం కుమారస్వామి ఇంటికి వెళ్లి పిలవగా పలకలేదు. గేట్‌పై నుంచి చూడగా కుమారస్వామి వరండాలో పడి ఉన్నాడు. పక్కనే ఉన్న నల్లతీగల కట్టయ్య, కరుగుత్త చిన్న గోపాల్‌తో కలిసి లోపలికి వెళ్లి చూడగా టేబుల్‌పై పురుగుల మందు డబ్బా ఉండి అరుగుపై పురుగుల మందు పడిఉంది. టేబుల్‌పై పేపర్‌లో నాకు రూ. 10లక్షల అప్పు ఉంది.. తీర్చలేక చనిపోతున్నా అని సూసైడ్ నోట్ రాసి ఉండడంతో కుమారస్వామి కుమారుడు విక్రమ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ ఘటనపై భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్. నరేశ్ తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడు..



ఎల్లయ్య (ఫైల్)

నెల్లికుదురు: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మునిగలవీడులో చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్ బాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ధర్మారపు ఎల్లయ్య (30) కుటుంబ కలహాలతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం తన భార్యను తల్లిగారింటికి పంపించాడు. బుధవారం మద్యం మత్తులో క్షణికావేశానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ బాబు తెలిపారు.

మెడికల్ షాపుల్లో డిస్కౌంట్ లేని వివరాలు ప్రదర్శించాలి

హన్మకొండ: మహారాష్ట్ర మాదిరి తెలంగాణ రాష్ట్రంలో ప్రతీ మెడికల్ షాపు ఎదుట డిస్కౌంట్ లేని వివరాలు, నాణ్యత పోస్టర్ ప్రదర్శించాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ బి.యోగానందంను వినియోగదారుల సంఘాల ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందించారు. మెడికల్ షాపుల్లో డిస్కౌంట్, ఆఫర్ల ఔషధాల అమ్మకాలు అరికట్టాలని, ఫార్మాసిస్టులు ఉండేలా చూడాలని కోరా రు. వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి, ఏబీసీడబ్ల్యూసీ జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు దొంతి శీ ల్పా రెడ్డి, నిజామాబాద్ వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు వి.యస్.వర్మ, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శులు గైని రత్నాకర్ రవి కుమార్ పాల్గొన్నారు.

రైల్వేలైన్ వర్క్‌తో 94 రైళ్ల రద్దు

- పలు రైళ్లు దారి మళ్లింపు.. రీషెడ్యూల్
- ఈనెల 26 నుంచి అమలులోకి..



కాజీపేట రూరల్ : వరంగల్-హసన్‌పర్తి-కాజీపేట ఎఫ్ క్యాబిన్ల మధ్య రైల్వే లైన్ వర్క్‌తో కాజీపేట, వరంగల్ మీదుగా వివిధ మార్గాల్లో నడిచే పలు రైళ్లను ఈనెల 26వ తేదీ నుంచి రద్దు చేసి మరికొన్ని రైళ్లను దారిమళ్లించి, రీషెడ్యూల్ చేసి నడించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం తెలిపారు.

రద్దయిన ప్రధాన రైళ్ల వివరాలు..

26 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు కాజీపేట-సిర్పూర్ టౌన్(17003) డైలీ ప్యాసింజర్, 27 నుంచి అక్టోబర్ 8 వరకు సిర్పూర్ టౌన్-భద్రాచలంరోడ్ (17034) డైలీ ప్యాసింజర్, 26 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు భద్రాచలంరోడ్-బల్లార్షా(17033) డైలీ ప్యాసింజర్, బల్లార్షా-కాజీపేట(17004) డైలీ ప్యాసింజర్, 25 నుంచి అక్టోబర్ 7 వరకు కాజీపేట-డోర్నకల్ (07753) పుష్‌పుల్, డోర్నకల్-కాజీపేట (07754) పుష్‌పుల్, 26 నుంచి అక్టోబర్ 7 వరకు కరీంనగర్-సిర్పూర్‌టౌన్ (07765) పుష్‌పుల్, 27 నుంచి అక్టోబర్ 8 వరకు సిర్పూర్‌టౌన్-కరీంనగర్ (07766) పుష్‌పుల్, 25 నుంచి అక్టోబర్ 7 వరకు డోర్నకల్-విజయవాడ (07755) పుష్‌పుల్, విజయవాడ-డోర్నకల్ (07756) పుష్‌పుల్, 23 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు సికింద్రాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్(12757) డైలీ ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ (12758) డైలీ ఎక్స్‌ప్రెస్, 28, 29, అక్టోబర్ 2,3,6,7,10వ తేదీల్లో హైదరాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్ (17011) డైలీ ఎక్స్‌ప్రెస్, సిర్పూర్‌కాగజ్‌నగర్-బీదర్ (17012) డైలీ ఎక్స్‌ప్రెస్, బీదర్-సిర్పూర్‌కాగజ్‌నగర్ (17012) డైలీ ఎక్స్‌ప్రెస్, 22 నుంచి అక్టోబర్ 8 వరకు సికింద్రాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్ (17233) డైలీ ఎక్స్‌ప్రెస్, 23 నుంచి అక్టోబర్ 8 వరకు సిర్పూర్‌కాగజ్‌నగర్-సికింద్రాబాద్ (17234) డైలీ ఎక్స్‌ప్రెస్, 23 నుంచి అక్టోబర్ 7 వరకు గుంటూరు-సికింద్రాబాద్ (17201) డైలీ ఎక్స్‌ప్రెస్, 24 నుంచి అక్టోబర్ 8 వరకు సికింద్రాబాద్-గుంటూరు (17202) డైలీ ఎక్స్‌ప్రెస్, 23 నుంచి అక్టోబర్ 2 వరకు సికింద్రాబాద్-గుంటూరు(12706) డైలీ ఎక్స్‌ప్రెస్, గుంటూరు-సికింద్రాబాద్ (12705) డైలీ ఎక్స్‌ప్రెస్, 25 నుంచి అక్టోబర్ 7 వరకు విజయవాడ-సికింద్రాబాద్ (12713) డైలీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విజయవాడ(12714) డైలీ ఎక్స్‌ప్రెస్, 26 నుంచి అక్టోబర్ 7 వరకు భద్రాచలంరోడ్-సికింద్రాబాద్ (17660) డైలీ ఎక్స్‌ప్రెస్, 25 నుంచి అక్టోబర్ 6 వరకు సికింద్రాబాద్-భద్రాచలంరోడ్(17659) డైలీ ఎక్స్‌ప్రెస్, 25 నుంచి అక్టోబర్ 7 వరకు విజయవాడ-గుంటూరు (07464) డైలీ ఎక్స్‌ప్రెస్, 29 నుంచి అక్టోబర్ 6 వరకు యశ్వంత్‌పూర్-జబల్‌పూర్ (12193) ఆదివారం వీక్లీ, 28 నుంచి అక్టోబర్ 5 వరకు జబల్‌పూర్-యశ్వంత్‌పూర్ (12194) శనివారం వీక్లీ, 27 నుంచి అక్టోబర్ 1,4వ తేదీల్లో యశ్వంత్‌పూర్-కోర్బా (12251) మంగళ, శుక్ర వీక్లీ, 29 నుంచి అక్టోబర్ 3,6వ తేదీల్లో కోర్బా-యశ్వంత్‌పూర్ (12252) గురు, ఆది వీక్లీ, 22 నుంచి అక్టోబర్ 26, 27, 29, అక్టోబర్ 3, 4వ తేదీల్లో గోరఖ్‌పూర్-కోచ్‌వెలి(12511) గురు, శుక్ర, శని వీక్లీ, 24,26,27,29, అక్టోబర్ 3,4 తేదీల్లో కోచ్‌వెలి-గోరఖ్‌పూర్(12512) మంగళ, శుక్ర, ఆది వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

పలు రైళ్ల దారి మళ్లింపు..

కాజీపేట, వరంగల్ మీదుగా ప్రయాణించే 41 రైళ్లను వయా విశాఖపట్నం, విజయనగరం, రాయగఢ్, నాగ్‌పూర్ మీదుగా దారి మళ్లించి, కాజీపేట, వరంగల్ మీదుగా ప్రయాణించే 27 రైళ్లను రీషెడ్యూల్ చేసి నడిపిస్తున్నట్లు వారు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



లలిత మృతదేహం

గార్ల: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన బుధవారం గార్ల మండలం మద్దివంచ పంచాయతీ కొత్తతండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన ధరావత్ లలిత(32) ఉదయం దుస్తులు ఉతికి ఆరుబయట ఉన్న ఇనుప తీగపై ఆరేస్తోంది. ఈ క్రమంలో తీగకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై కేకలు వేస్తూ కిందపడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఇరుగుపొరుగు వారు వచ్చి చూసేసరికి అప్పటికే మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఘటనా స్థలిని విద్యుత్ ఏఈ మహేంద్రబాబు సందర్శించారు. భర్త రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్. జీనత్‌కుమార్ తెలిపారు.

విషజ్వరంతో ములుగులో మరో మహిళ..



జ్యోతి(ఫైల్)

ములుగు: విషజ్వరంతో ములుగు జిల్లా కేంద్రానికి చెందిన వంగల జ్యోతి (48) మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వంగల జ్యోతి తన సోదరుడు హనుమంతుచారితో కలిసి జిల్లా కేంద్రంలోని గొల్లవాడలో నివాసం ఉంటుంది. ఈ క్రమంలో ఈనెల 4వ తేదీ జ్యోతికి జ్వరం వచ్చింది. దీంతో ఏరియా ఆస్పత్రికి తరలించారు. జ్వరం తగ్గకపోవడంతోపాటు ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో 6వ తేదీన ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.

మరణంలోనూ వీడని రక్తసంబంధం..

- ఒకే రోజు తమ్ముడు, అక్క మృతి
- నెల్లుట్లలో తీవ్ర విషాదం



శంకర్ (ఫైల్)



రుక్కంబాయి (ఫైల్)

లింగాలఘణపురం : మరణంలోనూ వారి రక్తసంబంధం వీడిపోలేదు. ఒకే రోజు తమ్ముడు, అక్క మృతి చెందారు. అనారోగ్యంతో తమ్ముడు.. తమ్ముడి దీనస్థితిని చూసి కుప్పకూలి ఆస్పత్రిలో అక్క తనువు చాలించింది. దీంతో కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటన మండలంలోని నెల్లుట్లలో తీవ్ర విషాదం నింపింది. వివరాలు ఉన్నాయి.. నెల్లుట్లకు చెందిన గాడిపల్లి శంకర్ (53) కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం అస్వస్థతకు గురయ్యాడు. శంకర్ అక్క కుడికాల రుక్కంబాయి (56) తన ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులతో కలిసి నెల్లుట్లలోనే ఉంటుంది. ఈక్రమంలో తమ్ముడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలుసుకుంది. అనంతరం శంకర్ ఇంటికి వెళ్లి అతడిని చూసి ఒక్కసారిగా కుప్పకూలింది. స్పృహ కోల్పోయిన ఆమెను వెంటనే కుటుంబీకులు జనగామలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. శంకర్ ఉదయం 9 గంటలకు చనిపోగా రుక్కంబాయి మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఆస్పత్రిలో మృతి చెందింది. శంకర్ అంత్యక్రియలు బుధవారం నిర్వహించగా రుక్కంబాయి దహన సంస్కారాలు గురువారం చేయనున్నారు. శంకర్‌కు ముగ్గురు కూతుళ్లు ఉండగా వారి వివాహం జరిగింది. రుక్కంబాయి ఇద్దరు కూతుళ్లకు వివాహమైంది. కాగా, ఒకే రోజు తమ్ముడు, అక్క చనిపోవడంతో కుటుంబీకులు, బంధువులు గుండెలవిసేలా రోదించారు.

ఐసీఏఆర్ పరీక్షల్లో జాతీయ ర్యాంకులు

- వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థినుల ఘనత



వి.హర్షిత



బి.శ్వేత

వరంగల్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్)నిర్వహించిన పరీక్షల్లో జాతీయ స్థాయి ర్యాంకులు సాధించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బలరాం బుధవారం తెలిపారు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో వెల్ది హర్షిత 'వాటర్ సైన్స్-టెక్నాలజీ' విభాగంలో 2వ ర్యాంకు సాధించిందన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి బండేవాలి శ్వేత సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ పరీక్షలో జాతీయస్థాయిలో 6వ ర్యాంకు, 'వ్యవసాయ విస్తరణ' విభాగంలో ఎస్సీ కేటగిరీలో 1వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. వరంగల్ వ్యవసాయ కళాశాలకు ఇటీవల వ్యవసాయ యూనివర్సిటీ ఉత్తమ కళాశాలగా గుర్తింపు వచ్చిందన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను డీన్ బలరాంతో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.హేమశరత్ చంద్ర, అధ్యాపకులు అభినందించారు.